క్లుప్తంగా

భీమనపల్లిలో ఆర్డీవో తనిఖీలు



భీమనపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి

ఉప్పలగుప్తం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని భీమనపల్లిలో ఆర్డీవో జి.కేశవ వర్ధన్ రెడ్డి శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.మల్లికార్జునరావు, ఈవోపీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి, ఏఎస్ఐ శ్రీనుబాబు సమక్షంలో వాహనాలను పరిశీలించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి తరచూ పర్యవేక్షించాలని సూచించారు.

యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఏఎస్పీ బాషా



యోగా శిక్షణ పొందుతున్న పోలీసు సిబ్బంది, విద్యార్థులు

అమలాపురం టౌన్: స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పోలీస్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన యోగా శిక్షణా శిబిరాన్ని జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా శనివారం ఉదయం ప్రారంభించారు. అనంతరం యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ పోలీసు సిబ్బందికి, విద్యార్థులకు యోగాసానాలపై శిక్షణ ఇచ్చారు. యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అందరికీ యోగా నేర్పించాలన్న కాంక్షతో చేస్తున్న సేవలను ఏఎస్పీ ఖాదర్ బాషా, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి కొనియాడారు.

మత్స్యకారులకు జలదీపాల పంపిణీ



మత్స్యకారులకు జలదీపాన్ని అందజేస్తున్న ధనరాజ్

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు రూపొందించిన జలదీపాలను సముద్ర వేటకు వెళ్లే మత్స్యకారులకు శనివారం పంపిణీ చేశారు. బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని ఆరగట్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో జలదీపం పనితీరుపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. సముద్రంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులకు జలదీపం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఉప్పు నీటితో తయారు చేసిన ఈ దీపం పది రోజుల పాటు పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో వల్లూరి ధనరాజ్, డాక్టర్ జి.జీనా, డాక్టర్ దేవబాలన్, జి.రాజు, సీహెచ్‌డీజే రాజు, ఎస్‌టీ నాయుడు, లోవరాజు పాల్గొన్నారు.

యానాం నియోజకవర్గ ఇన్‌చార్జిగా అశోక్

యానాం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమికి మద్దతునిస్తున్న యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సెల్వ గణపతి ఆదేశాలు జారీ చేశారు. పుదుచ్చేరివ్యాప్తంగా మొత్తం 29 మంది ఇన్‌చార్జిలను ఆయా నియోజకవర్గాల్లో నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నమశ్శివాయం ఘన విజయానికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో కలిసి పనిచేస్తానన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి మొదటి నామినేషన్

యానాం: ఏప్రిల్ 19న జరగనున్న పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇండిపెండెంట్ అభ్యర్థి ఎ.కొట్టనే మొట్టమొదటి నామినేషన్ దాఖలు చేశారు. కొట్టనే తన నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కులోతుంగన్‌కు శనివారం అందజేశారు. నామినేషన్ల పత్రాల దాఖలుకు ఆఖరు తేదీ ఈ నెల 27 కాగా, స్క్రూటినీ 28న, నామినేషన్ పత్రాల ఉపసంహరణకు ఈ నెల 30గా ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

యానాం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించడానికి ముగ్గురు సభ్యులతో కూడిన జిల్లా గ్రీవెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు శనివారం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎ.కులోతుంగన్ తెలిపారు. కమిటీకి డిస్ట్రిక్ట్ డిప్యూటీ రిటర్నింగ్ అధికారి ఎం.వినయ్‌రాజ్, ఎన్నికల ఖర్చు మోనిటరింగ్ అధికారి జి.జగన్నాథన్, అకౌంట్స్ అండ్ ట్రెజరీ ఆఫీసర్ హెన్రీ థామస్‌లను నియమించామన్నారు. ఈ కమిటీ ఎప్పటికప్పుడు ఎన్నికల్లో పార్టీలు తరలించే మెటీరియల్, నగదు గురించి తెలుసుకుని విచారణ సాగిస్తుందన్నారు.

వైభవంగా వెంకన్న రథయాత్ర



యానాంలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామివారి రథయాత్ర



స్వామివారి రథ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

- వేలాదిగా హాజరైన అశేష భక్తజనం
- విశేష పూజలు చేసి రథయాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కశిరెడ్డి సత్యవీరవెంకన్న, కశిరెడ్డి వెంకటకృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు సోదరులు ఉత్సవదారులుగా రథయాత్ర జరిగింది. స్థానిక చిన్నా సెంటర్‌లో స్వామి రథానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ విశేష పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. యానాం, తాళ్లరేవు, ఇంజరం, నీలపల్లి, జార్జిపేట, ఐ.పోలవరం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి రథ యాత్రలో పాల్గొన్నారు. చిన్నా సెంటర్ నుంచి ప్రారంభమైన రథ యాత్ర పిల్లారాయవీధి, స్టేట్ బ్యాంకు పక్క నుంచి న్యూబస్టాండ్‌కు చేరుకుంది. వేలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో, అరటిపళ్లు, కొబ్బరికాయలు స్వామి రథంపై విసురుతూ తమ భక్తిని చాటుకున్నారు. రథయాత్రను పురస్కరించుకుని ఎస్పీ రాజశేఖరన్ ఆధ్వర్యంలో సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగునాథన్, శేరు నూకరాజు తదితరులు బందోబస్తు నిర్వహించారు.

స్వామి తీర్థానికి పోటెత్తిన జనసందోహం

వేంకటేశ్వరస్వామి రథయాత్రను పురస్కరించుకుని న్యూబస్టాండ్ వద్ద నిర్వహించిన తీర్థానికి మహిళలు, చిన్నారులు, యువతీయువకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అక్కడే నిలిపి ఉంచిన స్వామి రథం వద్ద భక్తులు బారులు తీరి మరీ పూజలు చేసేందుకు పోటీ పడ్డారు. పోలీసు భద్రత మధ్య స్వామి దర్శనానికి భక్తులను ఒక్కొక్కరిని పంపించారు.

రేపటి నుంచి వైఎస్సార్ సీపీ మండల సమావేశాలు

అమలాపురం రూరల్: నియోజకవర్గంలో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలను సిద్ధం చేసేందుకు సోమవారం నుంచి రెండు రోజుల పాటు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన మండల పార్టీ సమావేశాలు ఏర్పాటు చేశారని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఉప్పలగుప్తం మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం గొల్లవిల్లి ఆడిటోరియంలో, మధ్యాహ్నం 2 గంటలకు అమలాపురం రూరల్ మండల సమావేశం ఇందుపల్లి ఏ వన్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు అమలాపురం పట్టణ పార్టీ కార్యకర్తల సమావేశం అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో, మధ్యాహ్నం 2 గంటలకు అల్లవరం మండల కార్యకర్తల సమావేశం సత్యకస్తూరి కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుందన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి సమావేశాలను విజయవంతం చేయాలని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని కోరారు.

కార్యకర్తల కుటుంబానికి మంత్రి పరామర్శ



పెదగాడవిల్లిలో రామలింగేశ్వరరావు కుటుంబీకులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మండలంలోని పెదగాడవిల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు గుద్దటి రామలింగేశ్వరరావు భార్య మంగతాయారు ఇటీవల మరణించడంతో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మంగతాయారు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుద్దటి వెంకట మహాలక్ష్మి, గుద్దటి ప్రసాద్‌రావు, నాగరాజు, నిమ్మకాయల కాశి, సొసైటీ అధ్యక్షుడు అడపా రమేష్, పరిమి రాధాకృష్ణ తదితరులు మంత్రి వెంట ఉన్నారు. అదేవిధంగా సన్నవిల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు చిక్కం నాగబాబు, చిక్కం గురుప్రసాద్‌ల తండ్రి సద్గురురావు మరణించడంతో వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజా కుమారి ఉన్నారు.

గ్యాంగ్ వర్క్ పద్ధతిలో డ్రెయిన్ల పరిశుభ్రత



పారిశుధ్య విధానంపై సిబ్బందితో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో ఇక నుంచి గ్యాంగ్ వర్క్ పద్ధతిలో రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ ఎస్.మనోహర్ వెల్లడించారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్ పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, వార్డు సచివాలయాల పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులతో శనివారం సాయంత్రం గ్యాంగ్ వర్క్‌పై అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య పనుల మెరుగు కోసం పట్టణంలోని వ్యాపార కూడళ్లలో రాత్రి సమయాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్న మున్సిపాలిటీ ఇక నుంచి కేవలం డ్రెయిన్ల పూడిక తీతకు మధ్యాహ్నం సమయాన్ని కేటాయించామన్నారు. ఇంత కాలం ఉదయం పూట జరిగే పారిశుధ్య పనుల్లో కార్మికులు చెత్త తొలగింపుతోపాటు డ్రెయిన్ల పరిశుభ్రత కూడా జరిగేదన్నారు. ఇప్పుడు అలా కాకుండా ప్రత్యేకించి కొంతమంది పారిశుధ్య కార్మికులను గ్యాంగ్ వర్కు బృందంగా మలిచి ఈ పనులు చేపట్టనున్నారు. పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న 30 వార్డుల్లో రోజూ లేదా రెండు రోజుల్లో ఒక్కో వార్డులోని డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రోజూ మధ్యాహ్నం పూట ప్రతి వార్డులో ఏడు బ్యాచ్‌లుగా ఈ గ్యాంగ్ వర్కు బృందాలు డ్రెయిన్లను పరిశుభ్రం చేయనున్నాయని వివరించారు. ఈ కొత్త విధానానికి పట్టణ ప్రజలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలో దోమల నిర్మూలనకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. కొత్త ఫ్యాగింగ్ మెషీన్లు, స్ప్రేయర్లు వచ్చే వారం నుంచి అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు.

బలమైన ప్రజాస్వామ్యం ఓటుతోనే సాధ్యం



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఓటు హక్కుపై ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

అమలాపురం టౌన్: బలమైన ప్రజాస్వామ్యం ఓటుతోనే సాధ్యమవుతుందని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలియజెప్పే దిశగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యులు, సిబ్బందితో శనివారం జరిగిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సమీక్షా సమావేశానంతరం వైద్యులు, సిబ్బంది ఓటు హక్కు విలువ తెలియజెప్పుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. ప్రదర్శనలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరావుతో పాటు ఆస్పత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో ఓటర్ల చైతన్య స్వీప్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎన్నికల నోడల్ అధికారి ఎ.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లు అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు స్వీప్ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు హక్కు చాలా విలువైనదని, అన్ని వర్గాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నిస్వార్థమైన, సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటే ఏకైక ఆయుధమన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఎంఏకే భీమారావు, వృద్ధాశ్రమ డైరెక్టర్ రేపాక విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



కార్యదర్శుల సమావేశంలో డీఎల్‌పీవో బొజ్జిరాజు

ఉప్పలగుప్తం: గ్రామాల్లో అధికారులు ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇంటి పన్నుతో పాటు పంచాయతీలకు రావాల్సిన ఇతర పన్నులను సైతం త్వరగా వసూలు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో చేయవలసిన ఖర్చుపై జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు దాసరి కృష్ణాజీ, వి.సత్యనారాయణ, పెట్టా నాగేశ్వరరావు, పరమట సాయిబాబు, కె.రామలక్ష్మి, వి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఎన్నికల నేపథ్యంలో అధికారులు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించొద్దని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక సర్వశిక్షా అభియాన్ సమావేశ మందిరంలో పోలింగ్ ఆఫీసర్లకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల 19న యానాంలో జరగనున్న పోలింగ్ ప్రక్రియ విజయవంతానికి అందరూ కృషిచేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న 33 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన సమాచారంతో పాటు సిబ్బంది నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితుల స్వామికి తులసిపూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుబడి చెల్లించారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- అడుగడుగునా అపూర్వ స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు



చొల్లంగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చొల్లంగిలో ఎన్నికల ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా స్థానిక శ్రీఅభయాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కలిగిన మంచిని వివరిస్తూ తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. గడప గడపలో మహిళలు ఆయనకు మంగళ హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం చొల్లంగిపేట, జి.వేమవరం గ్రామ పంచాయతీల్లో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, బూరెల వెంకటరాజు, యర్రంనీడి అప్పారావు, రేవు మల్లీశ్వరి, గండి రామాంజనేయులు, దెయ్యాల సత్తిబాబు, మట్టా లింగమూర్తి, కాపవరపు శ్రీదేవి, వరిపల్లి శివాజీగణేష్, మాస శ్రీను, వార సూర్యకుమారి, పెట్ల శాంతకుమారి, నీలపాల శ్రీను, కడియాల శ్రీను, పోతుల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవకుడు దొమ్మేటి వెంకటరెడ్డి



వెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన సంఘ సేవకుడని న్యాయవాది ముషిణి రామకృష్ణారావు అన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి 171వ జయంతి కార్యక్రమం స్థానిక సూర్యనగర్‌లో రాయుడు కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. తొలుత దివంగత వెంకటరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముషిణి రామకృష్ణారావు మాట్లాడుతూ వెంకటరెడ్డి చేసిన పోరాటాలు, త్యాగాలు, సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో రాయుడు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, మట్టపర్తి నరసింహమూర్తి, యెల్లమిల్లి వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, ప్రవీణ్, వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు నోటు పుస్తకాల పంపిణీ



కామాక్షీ పీఠంలో చిన్నారులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అగర్వాల్

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో అనాథ పిల్లలకు జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) జాతీయ అధ్యక్షుడు ఇషాన్ ఆర్ అగర్వాల్ అమలాపురం జేసీఐ ఆధ్వర్యంలో శనివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక కోర్టుల ప్రాంగణంలో రెండు సిమెంట్ బెంచీలను ప్రారంభించారు. పట్టణ శివారు మెండివారిపేటలోని ముక్తి ధామ్‌లో ఉన్న గ్రంథాలయానికి ఒక బీరువాను బహూకరించారు. ఆయా కార్యక్రమాల్లో అమలాపురం జేసీఐ అధ్యక్షుడు ఆకొండి చాణక్య, చార్టర్ అధ్యక్షురాలు మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, జేసీఐ రాష్ట్ర అధ్యక్షురాలు కె.కృష్ణ భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనుసూరి ప్రియాంక, స్థానిక జేసీఐ ప్రతినిధులు అరవింద్, ఆకొండి పవన్, గుబ్బల సౌమ్య, కిరణ్, చరిష్మా తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనునాయక్

ముమ్మిడివరం: జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ బి.శ్రీనునాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రబీ రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనునాయక్ మాట్లాడుతూ దళారులు, మిల్లర్ల చేతుల్లో రైతులు నష్టపోకుండా రైతు భరోసా కేంద్రాలు కొనుగోలు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. సాధారణ రకం క్వింటాలుకు రూ.2,183, గ్రేడ్ ఏ రకం క్వింటాలుకు రూ.2,203గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. అలాగే సాధారణ రకం 75 కేజీలు రూ.1,637, గ్రేడ్ ఏ రకం 75 కేజీలు రూ.1,652కు కొనుగోలు చేయాలని సూచించారు. నిబంధనల మేరకు మట్టి, రాళ్లు వంటివి మూడు శాతం, పరిపక్వం లేని, వంకర తిరిగిన ధాన్యం గింజలకు మూడు శాతం, తేమ శాతం 17 శాతం మించి ఉండరాదన్నారు. ఈ-క్రాపు నమోదు చేసుకుని కేవైసీ పూర్తయిన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజుల్లో వారి ఖాతాలకు డబ్బు నేరుగా జమవుతుందని తెలిపారు. సదస్సులో వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్, డిప్యూటీ తహసీల్దార్ భారతి, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయాధికారులు, ఉద్యాన సహాయకులు, సొసైటీ సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి కార్యక్రమం ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక భగత్‌సింగ్ సెంటరులో శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి ఆజాద్ నాగసుధా కొండ, జిల్లా వపర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు తదితరులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, జక్కం జయకృష్ణ, ఆర్.శ్రీనివాసరావు, రవణం సుబ్బారావు, గోకరకొండ సుబ్బారావు, కల్వకొలను సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: స్థానిక ఎఐమ్ విద్యాసంస్థల ఆవరణలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమానికి శనివారం నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను స్ఫూర్తిగా తీసుకుని యువత సామాజిక సమస్యలపై ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్.రమేష్ బి.ప్రతాప్ వి.రాజేష్, కె.రమేష్, ఎస్.వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు శిక్షణ తరగతులు



చొల్లంగిలో శిక్షణ పొందిన ఆక్వా రైతులకు రొయ్యల మేత అందజేస్తున్న సీఐఎఫ్ఏ ప్రతినిధులు

తాళ్లరేవు: వనామీ రొయ్యల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెరుగైన యాజమాన్య పద్ధతులపై సీఐఎఫ్ఏ ప్రతినిధులు ఆక్వా రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని చొల్లంగిలో కేంద్రీయ మత్స్య శిక్షణా సంస్థ(సీఐఎఫ్ఏ) ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి మత్స్యశాఖ విశ్రాంత డీడీ డా.పి.రామ్మోహనరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రొయ్యల పెంపకంలో మెళకువలు, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కాకినాడ కేంద్రం ఇన్‌చార్జ్, సీనియర్ శాస్త్రవేత్త డా.మురళీధర్, పి.అందె మాట్లాడుతూ రైతులు నర్సరీ పెంపకంలో మెళకువలు పాటించి మంచి లాభాలు పొందాలన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న రైతులకు రొయ్యల మేతలు, ప్రొబయోటిక్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్‌డీఓ గోపి, సీఐఎఫ్ఏ డైరెక్టర్ డా.సీఎస్ రవిశంకర్, ప్రిన్సిపాల్ డా.జహంగీర్, శ్రీనివాసరావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ కమిటీల అధ్యక్షుల ఎంపిక

అల్లవరం: మండల వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీలను ఎంపిక జేస్తూ తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 16 అనుబంధ విభాగాలకు చెందిన అధ్యక్షులను నియమించారు. వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడిగా బళ్ల శ్యామ్, మహిళా విభాగ అధ్యక్షురాలుగా పులుసుగంటి శ్రీదేవి, రైతు విభాగానికి కుడుపూడి సూర్యప్రకాశరావు, విద్యార్థి విభాగానికి కొనుకు ప్రవీణ్, బీసీ సెల్‌కు యల్లమిల్లి బోసు, ఎస్సీ సెల్‌కు పరమట శ్రీను, ఎస్టీ సెల్ విభాగానికి అమలదాసు వెంకటరమణ, వైఎస్సార్ టీయూసీ విభాగానికి కాంద్రేగుల వెంకట సత్యనారాయణ, మైనారిటీ విభాగానికి షేక్ మస్తాన్ వలీ, వాణిజ్య విభాగానికి ఉద్దగిరి వీర్రాజు, కల్చరల్ విభాగానికి బి.సత్యనారాయణ, సేవాదళ్ విభాగానికి మొల్లేటి సాయిబాబు, పంచాయతీ రాజ్ విభాగానికి రాకాపు విజయలక్ష్మి, గ్రీవెన్స్ విభాగానికి బొంతు శ్రీను, చేనేత విభాగానికి అక్కిశెట్టి నరసింహమూర్తి, డాక్టర్స్ విభాగానికి విప్పర్తి వెంకటపతిరాజులను అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.